సాక్షి ఒడిశా

శనివారం, 6, మే, 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని, ఆలయ పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,93,019లు, వెండి 136.95 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



నెల రోజుల్లో చెల్లిస్తాం

- ట్రాక్ నిర్వాహకులకు బకాయిల పెండింగ్‌పై డీఆర్‌ఎం హామీ

- 8లో



రైల్వే టికెట్ కౌంటర్ వద్ద వివాదం

- సాధారణ తనిఖీల నిమిత్తం కొరాపుట్ నుంచి వచ్చిన అధికారులు

- 8లో

న్యూస్‌రీల్

మెరుగైన సేవలందించాలి

- బొరిగుమ్మ సీహెచ్‌సీలో అత్యాధునిక పరికరాలు ప్రారంభించిన ఎమ్మెల్యే



ఆస్పత్రిలో రోగులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: స్థానిక శాసనసభ నియోజకవర్గ పరిధిలోని బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రిలో సమితి ప్రజలు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఎక్స్‌రే, ఈసీజీ యంత్రాలను జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేయాలని ఎంతోకాలంగా ప్రజలు కోరుతున్నారని తెలిపారు. అది ఇప్పుడు నెరవేరిందన్నారు. ఇప్పటి వరకు బొరిగుమ్మ ప్రజలు ఎక్స్‌రే, ఈసీజీ పరీక్షలకు ప్రైవేటు ఆస్పత్రుల్లో అధిక డబ్బు చెల్లించాల్సి వచ్చేదని విచారం వ్యక్తంచేశారు. వీటి ఏర్పాటుతో ఇబ్బందులు తీరనున్నాయని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అరుణ పాఢి, డీపీఎం శుభకాంత గంతాయత్, బొరిగుమ్మ మెడికల్ అధికారి డాక్టర్ హరప్రసాద్ పాణిగ్రాహి, ప్రసూతి వైద్యాధికారి డాక్టర్ ప్రవీణకుమార్ దాస్, రేడియోగ్రాఫర్ సిపున్ మహంతి, పీపీఎం సరోజ్‌కుమార్ మహాపాత్రొ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వైద్య పరీక్షలు



దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందిస్తున్న వైద్యులు

జయపురం: పట్టణంలోని టౌన్ హాలులో పలువురు దివ్యాంగులకు సహాయ శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఇందులో 164మందికి వైద్య పరీక్షలు జరిపారు. పలువురికి కృత్రిమ అవయవాలు సమకూర్చగా, ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి వీటిని అందజేశారు. శిబిరంలో జయపురం సమితి అధ్యక్షురాలు సులోచన ముదులి, జిల్లా పరిషత్ సభ్యులు అస్తా నాయక్, తృప్తి పట్నాయక్, రస్మిత రథ్, జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అరుణకుమార్ పాఢి, బీడీఓ రాజీవ్‌దాస్, అదనపు బీడీఓ మనోజ్ నాయక్, జయపురం మున్సిపాలిటీ కార్యనిర్వాహ అధికారి సిద్ధార్థ పట్నాయక్, సీడీపీఓ సుచిత్ర పండా తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐ ఇంట్లో చోరీ



దుండగులు విరగ్గొట్టిన బీరువా

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీస్ స్టేషన్ పరిధి సాయిప్రియనగర్ 11వ లైన్‌లో నివాసం ఉంటున్న పోలీస్ ఏఎస్‌ఐ అనూప్‌కుమార్ శత్పతి ఇంట్లో చోరీ జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కలహండి జిల్లా కెసింగ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న శత్పతి తన కుటుంబంతో సహా రాయగడ సాయిప్రియ నగర్‌లో ఉంటున్నారు. గత మంగళవారం కుటుంబ సభ్యులంతా కెసింగలో విధులు నిర్వహిస్తున్న శత్పతి వద్దకు వెళ్లారు. గత కొద్ది రోజులుగా ఇంట్లో ఎవరూ లేరని గమనించిన దుండగులు తెల్లవారుజామున ఇంట్లోకి చొరబడి బీరువాను విరగ్గొట్టారు. అందులోని రూ.50 వేల నగదు, 12బంగారు లాకెట్లు, 4తులాల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఇరుగు–పొరుగు వారు గమనించి శత్పతికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే రాయగడ చేరుకున్న ఆయన.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైంటిఫిక్ బృందం రంగప్రవేశం చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దర్యాప్తు చేస్తున్న పోలీసులు

అక్షర ఆవిష్కర్తకు.. వందనం

- సంతాలీ భాషకు 'ఓల్‌చికి' లిపి రూపొందించిన పండిత్ రఘునాథ్ ముర్ము
- ఆయన జయంతి సందర్భంగా నివాళులర్పించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- 2003లో సంతాలీ లిపికి రాజ్యాంగ గుర్తింపు ఇచ్చిన కేంద్రం



పండిత్ రఘునాథ్ ముర్ము విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



దండబోష్‌లో పండిత్ రఘునాథ్ ముర్ము సమాధిని సందర్శిస్తున్న రాష్ట్రపతి

భువనేశ్వర్: సంతాలీ భాష ఓల్‌చికి లిపి సృష్టికర్త పండిత్ రఘునాథ్ ముర్ము జయంతి సందర్భంగా ఆయన జన్మస్థలం మయూర్‌భంజ్ జిల్లా దండబోష్‌లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. 'రఘునాథ్ కృషి ఫలితంగా సంతాలీ భాషకు ప్రత్యేకమైన లిపి మనుగడలో అందుబాటులోకి వచ్చింది. దీనిని భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చోటు చేసుకోవడం విశేషం. సంతాలి భాష సుసంపన్నం చేయడంలో ఆయన చేసిన కృషి చెక్కు చెదరనిది. ప్రపంచం, సంతాలీ సంఘం ఓల్‌చికి లిపి ఆవిష్కర్త సేవలను స్మరించుకుంద'ని రాష్ట్రపతి కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన జన్మస్థలం, మయూర్‌భంజ్ జిల్లా దండబోష్ గ్రామం ప్రత్యేక అలంకరణతో కళకళలాడింది. ఈ సందర్భంగా నిర్వహించిన పుట్టినరోజు వేడుకలలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాలుపంచుకోవడం విశేషం.

మాతృభాషపై మమకారం..

118 ఏళ్ల క్రితం 1905లో వైశాఖ పూర్ణిమ రోజున దండబోష్‌లో అప్పటి గ్రామపెద్ద నందలాల్ ముర్ము, సలామా ముర్ము దంపతులకు పండిత్ ముర్ముజన్మించాడు. సంతాలీ సమాజానికి వారి భావాలు, అనుభవాలను రచన ద్వారా వ్యక్తీకరించడానికి ఓల్‌చికి లిపిని ఆవిష్కరించారు. ఈ లిపి శాస్త్రీయ భాషగా గుర్తింపు సాధించింది. పండిత్ ముర్మును ప్రపంచం గొప్ప సాహిత్యవేత్తగా అంగీకరించింది. చిన్నప్పటి నుంచి మాతృభాష సంతాలీ పట్ల మక్కువ పెంచుకున్న ఆయన.. దీనికి లిపి లేదనే భావోద్వేగంతో ఆవిష్కరణకు ఉద్యమించాడు. ఉపాధ్యాయ వృత్తిలో అడుగిడి సంతాలీ లిపిని అభివృద్ధి చేయడంలో నిమగ్నమయ్యారు. నిర్విరామ కృషితో 1925లో సొంతం లిపిని రూపొందించడంలో విజయం సాధించారు. 1939లో పండిత్ ముర్ము మొదటి పుస్తకాన్ని ప్రచురించడంతో ఓల్‌చికి లిపి తొలి ఉనికిని వెలుగులోకి వచ్చింది. 2003 డిసెంబర్ 22న కేంద్రంలో అటల్‌బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం ఓల్‌చికి లిపి, సంతాలీ భాషకు రాజ్యాంగ గుర్తింపు ఇచ్చింది.

వారసత్వ ప్రాంతంగా జన్మస్థలం..

పండిత్ రఘునాథ్ ముర్ముకు సంబంధించిన స్థలాల అభివృద్ధికి ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రూ.10 కోట్లను మంజూరు చేశారు. రఘునాథ్ ముర్ము వర్ధంతి సందర్భంగా ఆయన స్మారకార్థం కేంద్ర గిరిజన సంక్షేమ మంత్రిత్వశాఖ గత ఏడాది ప్రత్యేక రథాన్ని ప్రారంభించింది. అప్పటి నుంచి ఈ రథం రాష్ట్రంలోని 26 డివిజన్లలో ప్రయాణించి, శుక్రవారం ముగిసింది. భారత ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వం పండిత్ రఘునాథ్ ముర్ము జన్మస్థలాన్ని వారసత్వ ప్రాంతంగా ప్రకటించడం విశేషం.

మాజీ రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్‌కు..



మాజీ రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తున్న ద్రౌపది ముర్ము

భారత మాజీ రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ జయంతి సందర్భంగా రాయ్‌రంగ్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము పూలమాల వేసి, నివాళులర్పించారు. జైల్‌సింగ్ 1982–87 మధ్య దేశానికి ఏడో రాష్ట్రపతిగా సేవలందించారు. ఈ పదవి చేపట్టిన ఏకైక సిక్కు వ్యక్తిగా రికార్డు సృష్టించారు. పౌరహక్కుల కార్యకర్త, సంఘసంస్కర్త, అణగారిన వారి అభ్యుదయానికి నిర్విరామ కృషి చేసిన ప్రముఖునిగా పేరొందారు. ఆయన జీవిత కాలంలో సుదృఢమైన రాజకీయ చతురత చాటుకున్నారు. వివిధ పదవులను విజయవంతంగా నిర్వహించారు. రాష్ట్రపతి కావడానికి ముందు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్(ఐఎన్‌సీ) ప్రముఖ సభ్యుడిగా, కేంద్ర మంత్రివర్గంలో హోంమంత్రిగా సహా అనేక హోదాల్లో పని చేశారు.

జగన్నాథుని సేవలో సీజేఐ



జగన్నాథుని సన్నిధిలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి



భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు స్వాగతం పలుకుతున్న సీఎస్

భువనేశ్వర్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పూరీ జగన్నాథుని దర్శించుకున్నారు. రెండు రోజుల రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన సీజేఐ.. భువనేశ్వర్ చేరుకుని విమానాశ్రయం నుంచి నేరుగా పూరీ వెళ్లారు. అంతరాలయంలో రత్న సింహాసనంపై ఆసీనులైన చతుర్ధా మూర్తులను శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం శ్రీమందిరం ప్రాంగణంలో విమలాదేవి, శ్రీ మహాలక్ష్మి, సాక్షి గోపీనాథ్, కన్నోపాడా హనుమంతుడు, ఇతర పార్శ్వ దేవ దేవతలను దర్శించారు. ఆలయానికి చేరుకున్న ప్రధాన న్యాయమూర్తికి జిల్లా యంత్రాంగం, ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. శ్రీమందిరం సింహద్వారం వద్ద హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా, అడ్వకేట్ జనరల్ ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం పలికారు. రాష్ట్రంలో తన 3రోజుల బస సందర్భంగా, ప్రధాన న్యాయమూర్తి శనివారం కటక్ జ్యుడీషియల్ అకాడమీలో జరిగే పేపర్‌లెస్ కోర్టుల డిజిటలైజేషన్‌పై జాతీయ సదస్సుకు హాజరు కానున్నారు.

పుష్ప2 చిత్రీకరణకు సర్వం సిద్ధం



పొల్లేరు పరిసరాలను పరిశీలిస్తున్న దర్శకుడు సుకుమార్, చిత్ర బృందం

- మల్కన్‌గిరి జిల్లాలో పర్యటించిన చిత్ర దర్శకుడు సుకుమార్



పొల్లేరు నదిలో సుకుమార్, కుబ బ్రోచెక్



పుష్ప2 పోస్టర్

మల్కన్‌గిరి: గతేడాది విడుదలై, సంచలనం తెలుగు చిత్రం పుష్ప2 దర్శకుడు సుకుమార్, చిత్ర బందం జిల్లాలోని కలిమెల సమితి మన్యంకొండ పంచాయతీ పొల్లేరు గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. సినిమా రెండో భాగం చిత్రీకరణలో భాగంగా మైత్రీమూవీ మేకర్స్ సంస్థ ప్రొడక్షన్ మేనేజర్ పి.వేంకటేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్ ఏప్రిల్‌లో వివిధ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మల్కన్‌గిరి కలెక్టర్ విశాల్‌సింగ్, ఎస్పీ నితీష్ వాధ్వనీ లను కలిసి, షూటింగ్ నిమిత్తం అనుమతులు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో 20మందితో కూడిన బృందం దర్శకుడు సుకుమార్, సినిమాటోగ్రఫీ మిరస్లోవ్ కుబ బ్రోచెక్(రష్యా) తదితరులు చిత్రీకరణ చేపట్టనున్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడుతూ మల్కన్‌గిరి జిల్లా ప్రకృతి సౌందర్యానికి పెట్టింది పేరని కొనియాడారు. పొల్లేరు ప్రాంతంలో మరో 2నెలల్లో షూటింగ్ ప్రారంభిస్తామని, పుష్ప1 ఎంతటి ఘన విజయం సాధించిందో.. రెండో భాగం కూడా ప్రేక్షకులను అదే స్థాయిలో అలరిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. జిల్లాలోని స్వాభిమాన్ ఏరియా హంతాళ్‌గూడ ఘాట్ రోడ్డు, బలిమెల రిజర్వాయర్, పొల్లేరు చుట్టుపక్కల వంతెనలు, నదులు, కాలువల పరిసరాల్లో చిత్రీకరణకు యోచిస్తున్నట్లు వివరించారు. షూటింగ్‌లో హీరో అల్లూ అర్జున్, హీరోయిన్ సాయిపల్లవి, రష్మిక, నటులు సునీల్, అజయ్ గౌడ్, సీకాయత్, ఫాహద్ ఫాజల్ తదితరులు రానున్నట్లు ప్రకటించారు.

పర్లాకిమిడిలో బబి దాస్ పర్యటన



బబి దాస్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రదీప్ నాయక్



సర్క్యూట్ హౌస్ నుంచి బయటకు వస్తున్న ఎంపీ, బబి దాస్

పర్లాకిమిడి: బిజూ జనతాదళ్ సాధారణ కార్యదర్శి, జాజ్‌పూర్ ఎమ్మెల్యే ప్రణబ్‌ప్రకాష్ దాస్(బబి దాస్) గజపతి జిల్లా పర్లాకిమిడిలో శుక్రవారం పర్యటించారు. ఆయన వెంట బరంపురం ఎంపీ చంద్రశేఖర సాహు, బీజేడీ జిల్లా అధ్యక్షుడు జగబంధు దాస్, సాధారణ కార్యదర్శి ప్రదీప్ నాయక్, యువజన నాయకులు శాసనం లింగరాజు, రాయఘడ చైర్మన్, జిల్లా మహిళా అధ్యక్షురాలు పూర్ణబాసి నాయక్, సీనియర్ నాయకులు తిరుపతి పాణిగ్రాహి, యువ నాయకులు రూపేష్ పాణిగ్రాహి, టౌన్ అధ్యక్షుడు సిత్తు మహాపాత్రొ ఉన్నారు. ఈనెల 9న రాష్ట్ర 5టీ కార్యదర్శి, సీఎం ప్రత్యేక కార్యదర్శి వీ.కార్తికేయ పాండ్యన్ చంద్రగిరిలో పర్యటించనున్న నేపథ్యంలో ఆయనకు జిల్లావ్యాప్తంగా, పర్లాకిమిడిలో కృష్ణచంద్ర గజపతి స్వయం ప్రతిపత్తి కళాశాలకు వర్సిటీ హోదా, పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పథకాలు, నిధుల జాబితా ఇవ్వాల్సిందిగా పార్టీ ప్రతినిధులకు సూచించినట్లు సమాచారం. అనంతరం తిరిగి మోహానా నియోజకవర్గ పర్యటనకు వెళ్లారు.

పర్లాకిమిడిలో అన్నమయ్య జయంతి



సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

పర్లాకిమిడి: వేంకటేశ్వరుని పరమభక్తుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి సందర్భంగా స్థానిక వేంకటేశ్వర ఆలయంలో సంకీర్తనా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో భద్ర శారదాబాల, శిష్యబృందం ఆధ్వర్యంలో అన్నమాచార్య భక్తి సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమాన్ని ఆలయన ప్రధానార్చకులు భద్రం శ్రీనివాసాచార్యులు, చక్రధర్ పర్యవేక్షించారు.

2,880 కిలోల గంజాయికి నిప్పు



బరంపురం: స్వాధీనం చేసుకున్న గంజాయి, వాహనాలతో ఎక్సైజ్ అధికారులు



స్వాధీనం చేసుకున్న గంజాయి వివరాలు సరిచూస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు నిర్వహించిన దాడుల్లో 30 కేసులను నమోదు చేయడంతో పాటు స్వాధీనం చేసుకున్న 2,880.4 కిలోల గంజాయిని జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ శుక్రవారం ధ్వంసం చేసింది. అధికారుల సమక్షంరాయగడ సమీపంలోని ఇండియన్ మెటల్స్ అండ్ ఫెర్రొ ఎల్లాయిస్ కర్మాగారంలో వీటికి నిప్పంటించారు. జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.

భారీగా గంజాయి స్వాధీనం

బరంపురం: స్థానిక నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న రూ.85 లక్షల విలువైన గంజాయిని బరంపురం ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారి తపన్‌కుమార్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం కొందమాల్ జిల్లా దరింగబడి నుంచి బరంపురం నగరానికి కారు, ట్రక్కులో, 2 బైకుల్లో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు దాడులు నిర్వహించి, రూ.85 లక్షల విలువైన సరుకును స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి డ్రైవర్‌ను అరెస్ట్ చేసి, వాహనాలను సీజ్ చేశారు.

లారీ యజమానుల సంఘానికి కొత్త కార్యవర్గం

- అధ్యక్ష పదవికి కొండబాబు ఏకగ్రీవం
- పట్టణంలో భారీ విజయోత్సవ ర్యాలీ



అమ్మవారి దర్శనం కోసం వచ్చిన కార్యవర్గం సభ్యులు



ఎన్నికల ఫలితాలను అధికారికంగా ప్రకటిస్తున్న అధికారులు

రాయగడ:

గత నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న లారీ యజమానుల సంఘానికి ఎన్నికలు జరిగాయి. ఈ మేరకు నూతన కార్యవర్గం కొలువుదీరగా.. అధ్యక్షుడిగా వై.వేంకటేశ్వరరావు(కొండబాబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రముఖ న్యాయవాదులు కింతలి రాజు, బ్రజసుందర్ నాయక్, బిరజా పాత్రొ పర్యవేక్షకులుగా వ్యవహరించారు. అధ్యక్ష పదవితో పాటు సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రామ్‌మోహన్ రావు, సాధారణ కార్యదర్శిగా కె.జానకీరామయ్య, ఉపాధ్యక్షుడిగా కె.సూర్యారావు, ధర్మ, సహాయ కార్యదర్శిగా ఎం.భానుప్రసాద్, సుధా ముదులి, కోశాధికారులుగా బి.ప్రసాద్, ప్రసాంత్ సామల్ ఎన్నికయ్యారు.

విజయోత్సవ ర్యాలీ..

సుదీర్ఘ విరామం తరువాత లారీ యజమానుల సంఘానికి నూతన కార్యవర్గం ఏర్పాటు కావడంతో పాటు బీజేడీ సీనియర్ నాయకుడు కొండబాబు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం పట్ల ఆయన మద్దతుదారులు, అభిమానులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక రింగ్ రోడ్డు వద్ద ఉన్న పార్టీ కార్యకర్తలుస కార్యాలయం నుంచి బయలుదేరి మజ్జిగౌరమ్మ మందిరానికి చేరుకున్నారు. వీరంతా అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్న అనంతరం ఎన్నికైన వారికి లారీల్లో ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. తుంభిగుడ కూడలి వరకు కొనసాగిన ఈ ర్యాలీలో అడుగడుగున బాణాసంచా, ఆదివాసీ సంప్రదాయ నృత్యాలతో ర్యాలీ కొనసాగింది. లారీ యజమానుల సంఘంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానని ఈ సందర్భంగా కొండబాబు మీడియాతో ప్రకటించారు. అదే సమయంలో లోడింగ్ విషయంలో గతంలో నానా ఎదుర్కొన్నారని, ఇకపై ఆ సమస్య ఉండదని పేర్కొన్నారు.

క్లుప్తంగా

పంజా విసిరిన పులి

శృంగవరపుకోట: గతంలో ఎస్.కోట ప్రాంత వాసుల కంటిమీద కునుకు లేకుండా చేసిన బెబ్బులి మళ్లీ వచ్చింది. కిల్తంపాలెం పంచాయతీ భర్తాపురం గ్రామానికి చెందిన కాండ్రేగుల సూరిబాబు కళ్లంలో ఉన్న ఆవుదూడపై గురువారం రాత్రి పంజా విసిరింది. కాస్త దూరంగా ఈడ్చుకుపోయి సగం దూడను తినేసింది. పులి పాదముద్రలను గుర్తించిన రైతు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. డీఆర్ఓ రవి తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. పులి పాదముద్రలుగా నిర్ధారించారు. మగపులి తిరుగుతున్నట్టు చెప్పారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇటు ముషిడిపల్లి, పెదఖండేపల్లి, భర్తాపురం గ్రామాల్లోను, అటు కొత్తూరు, మల్లిపూడి గ్రామాల్లో పులి జాడలు కనిపించడంతో పులిసంచారం ఎటుఉందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి పులిని పట్టుకునే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

100 మద్యం బాటిల్స్ పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిల్స్ రవాణా చేస్తున్న వ్యక్తి, పోలీసులు

చీపురుపల్లి: మద్యం బాటిల్స్ అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని మండలంలోని రావివలస జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఎ.సన్యాశినాయుడు చెప్పారు. ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు శుక్రవారం తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన దాడుల్లో రావివలస జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనంపై 100 మద్యం బాటిల్స్ అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మద్యం బాటిల్స్ అక్రమంగా తరలించినా, బెల్టు దుకాణాలు నిర్వహించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

లారీ బోల్తా



జాతీయ రహదారి బ్రిడ్జి సమీపంలో కర్రల లోడుతో బోల్తాపడిన లారీ

గజపతినగరం: మండలంలోని ఎం.వెంకటాపురం బ్రిడ్జి సమీపంలో కర్రలలోడుతో ఉన్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. అయితే అదృష్టవశాత్తు పెనుప్రమాదం తప్పింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురవడంతో రోడ్డు బురద మయంగా ఉండడం వల్ల విజయనగరం నుంచి రామభద్రపురం వైపు వెళ్తున్న లారీ ఒక్కసారిగా అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో రాకపోకలు సాగించిన వారెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై గంగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

యువతి ఆత్మహత్యకేసులో తండ్రికి మూడేళ్ల జైలుశిక్ష

సంతకవిటి: మండలంలోని గోళ్లవలస గ్రామానికి చెందిన యువతి వెంపటాపు భారతి 2017లో ఆత్మహత్యకు పాల్పడిన కేసుకు సంబంధించి ఆమె తండ్రి వెంపటాపు కామినాయుడుకు రాజాం అసిస్టెంట్ సెషన్ జడ్జి కోర్టు మూడేళ్ల జైలుశిక్ష విధించినట్లు సంతకవిటి స్టేషన్ ఏఎస్సై వాసుదేవరావు శుక్రవారం తెలిపారు. 2017 జూలై 11న యువతి తల్లి భాగ్యలత ఫిర్యాదుమేరకు అప్పటి సంతకవిటి ఎస్సై చిరంజీవి కేసు నమోదుచేసి, రాజాం కోర్టుకు అప్పగించారు. ఈ కేసులో పదిమంది నిందితులు ఉండగా, వారంతా నిరపరాధులుగా రాజాం కోర్టు గుర్తించింది. వాదోపవాదాల అనంతరం యువతి తండ్రిని ముద్దాయిగా నిర్ధారించి జడ్జి ఎం.బాబు శిక్ష విధించారు.

ఐదు కేజీల గంజాయి స్వాధీనం



రెవెన్యూ అధికారుల సమక్షంలో గంజాయి తూస్తున్న ఎస్సై వెంకటరమణ

పాచిపెంట: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఒక వ్యక్తి నుంచి ఐదుకేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరికి చెందిన కుమ హంటల్ గురువారం రాత్రి ద్విచక్రవాహనంపై ఒడిశానుంచి సాలూరు వైపు గంజాయి తరలిస్తుండగా పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద పట్టుబడినట్లు చెప్పారు. ఆ వ్యక్తి నుంచి గంజాయి, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారుల సమక్షంలో తూనిక వేసి, పట్టుబడిన వ్యక్తిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నెల రోజుల్లో చెల్లిస్తాం



శ్రామిక్ కాంగ్రెసు వర్గీయులతో సమావేశమైన ఖుర్దారోడ్ డీఆర్ఎం రింకేష్ రాయ్

- ట్రాక్ నిర్వాహకులకు బకాయిలు పెండింగ్‌పై డీఆర్ఎం హామీ
- పలాస రైల్వే కాలనీలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు

భువనేశ్వర్: సిబ్బంది సంక్షేమానికి శ్రామిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన మంతనాలు ఫలితానిచ్చాయి. ట్రాక్ నిర్వాహకులకు చెల్లించాల్సిన బకాయిలను నెల రోజుల్లో చెల్లిస్తామని డీఆర్ఎం భరోసా ఇచ్చారు. తూర్పుకోస్తా రైల్వే ఖుర్దారోడ్ మండలం అధికారి(డీఆర్ఎం) రింకేష్‌రాయ్ తూర్పుకోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెసు వర్గంతో(పీఎస్ఎం) శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రామిక్ కాంగ్రెసు 55 ప్రతిపాదనలను చర్చకు ప్రతిపాదించింది. వీటిలో 40అంశాలను డీఆర్ఎం చర్చించారు. ఈ మేరకు నిర్దిష్టమైన కార్యాచరణతో అనుబంధ మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది ఆరోగ్యం, వసతి, పారిశుద్ధ్యం, దైనందిన విధి నిర్వహణలో దీర్ఘకాల సమస్యల తొలగింపు ప్రధాన అంశాలుగా యాజమాన్యం, శ్రామిక కాంగ్రెస్ వర్గాల మధ్య చర్చ ఫలప్రదమైందని శ్రామిక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేష్‌చంద్ర సాహు తెలిపారు. బరంపురం నుంచి పలాస ప్రాంత సిబ్బంది ఉన్నత చికిత్సకు విశాఖపట్నం కార్పొరేట్ ఆస్పత్రు ల్లో అవకాశం కల్పించాలని ప్రతిపాదించారు. ఆగ్నేయ రైల్వే జోన్ పునర్విభజన పురస్కరించుకుని తొలగిపోయిన అత్యవసర కోటా రిజర్వేషన్ సదుపాయం పునరుద్ధరణ, ఖుర్దారోడ్ రైల్వేస్టేషన్‌లో రైల్వే కల్యాణ మండపం విస్తరణ, డివిజన్ వ్యాప్తంగా సిబ్బంది వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలం కేటాయించాలని అధికార వర్గానికి ప్రతిపాదించారు.

గార్డు లాబీ తొలగించేందుకు ప్రతిపాదన..

ఖుర్దారోడ్ రైల్వే స్టేషను ఒకటో నంబరు ప్లాట్‌ఫాం నుంచి గార్డు లాబీ తొలగించేందుకు శ్రామిక్ కాంగ్రెస్ కార్యకర్తలతో సంయుక్త పర్యవేక్షణకు ఆదేశించారు. మెమూ సిబ్బంది సమస్యల నివారణకు సానుకూల చర్యలు చేపడతారు. పారాదీప్, పలాస రైల్వే కాలనీలో నీటి ఎద్దడి నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమస్య నివారణకు అదనపు గొట్టపు బావులు తవ్విస్తారు. రైల్వే ఆస్పత్రుల్లో వైద్యులు, అనుబంధ సిబ్బంది ఖాళీలను భర్తీ చేయనున్నారు. కొత్త క్వార్టర్ల నిర్మాణంతో డివిజన్ వ్యాప్తంగా ప్రధాన రైల్వేస్టేషన్లలో సిబ్బందికి వసతి కొరత నివారణ కార్యకలాపాలు చురుగ్గా సాగుతున్నట్లు డీఆర్ఎం వివరించారు. టైపు–2 రైల్వే క్వార్టర్లలో సిబ్బంది ఎయిర్ కండిషన్ ఏర్పాటుకు అనుకూలంగా సాంకేతిక సదుపాయాలను విస్తరిస్తున్నారు. రైల్వే కాలనీల పరిశుభ్రత, ఘన వ్యర్థ నిర్వహణ, లెవెల్ క్రాసింగ్ గేట్లకు నిరంతర విద్యుత్ సరఫరా, మహిళా సిబ్బందికి ప్రత్యేక మరుగుదొడ్లు, విశ్రాంతి గదుల సౌకర్యాలు ప్రధాన అజెండాగా పేర్కొన్నారు.

రైల్వే టికెట్ కౌంటర్ వద్ద వివాదం



రైల్వే కౌంటర్ వద్ద బీజేడీ, బీజేపీ నాయకుల వాగ్వాదం

- సాధారణ తనిఖీల నిమిత్తం కొరాపుట్ నుంచి వచ్చిన అధికారులు
- నవరంగపూర్‌లో రిజర్వేషన్ కౌంటర్ ఎత్తి వేస్తారంటూ వదంతులు



కౌంటర్ వద్ద రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీఎన్ అప్పారావుతో వాదిస్తున్న బీజేడీ నాయకుడు భీమె హరిజన్

కొరాపుట్: నవరంగ్‌పూర్ రైల్వే రిజర్వేషన్ టికెట్ కౌంటర్ వద్ద వివాదం నెలకొంది. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ బస్టాండ్ ఆవరణలో ఉన్న కౌంటర్ వద్దకు కొరాపుట్ నుంచి రైల్వే సిబ్బంది చేరుకున్నారు. నెలవారీ ప్రక్రియలో భాగంగా కౌంటర్‌లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అయితే కొందరు వ్యక్తులు జిల్లా కేంద్రంలోని ప్రముఖులకు ఫోన్ చేసి, టికెట్ కౌంటర్ తొలగించడానికి సిబ్బంది వచ్చారని సమాచారం ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడా రైల్వేలైన్, స్టేషన్ లేవు. రైల్వేకి సంబంధించి కేవలం ఒక్క కౌంటర్ మాత్రమే ఉంది. దీనిపైనే 10 సమితులు, 2 మున్సిపాలిటీలకు చెందిన ప్రయాణికులు ఆధార పడి ఉన్నాయి. నిత్యం కిటకిటలాడుతూ కనిపించే కౌంటర్ ఎత్తి వేస్తే ప్రజలు టికెట్ రిజర్వేషన్ కోసం పక్క జిల్లాలు కొరాపుట్, కలహండి జిల్లాలకు వెళ్లాలి ఉంటుంది. అలాగే పక్కనే ఉన్న కలహండి జిల్లా భవానీపట్నలో 3 కౌంటర్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పుర ప్రముఖులు ఆగ్రహావేశాలతో కౌంటర్ వద్దకు చేరుకున్నారు. కొరాపుట్ నుంచి వచ్చిన సిబ్బందితో వాదనకు దిగారు.

పోటీపోటీగా హామీలు..

కొరాపుట్ నుంచి వచ్చిన రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీఎన్ అప్పారావు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. తాము కౌంటర్ ఎత్తి వేయడానికి రాలేదని, పని తీరు పరిశీలనకు మాత్రమే వచ్చామన్నారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే చెప్పాలని సూచించగా.. స్థానికులు శాంతించారు. వెంట వచ్చిన ఆర్‌పీఎఫ్ సిబ్బంది ప్రజలకు సముదాయించారు. వెంటనే అక్కడకే చేరుకున్న బీజేడీ నాయకులు భీమె హరిజన్, బీజేడీ పట్టణ అధ్యక్షుడు ప్రమోద్ పాఢి తదితరులు సమస్యపై నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్ మాఝి, ఎస్‌డీసీ సలహాదారు ప్రదీప్ మాఝికి ఫిర్యాదు చేశారు. దీంతో వాల్తేర్ డీఆర్ఎంతో మాట్లాడుతామని వారు హామీ ఇచ్చారు. వెంటనే బీజేపీ బృందం సైతం అక్కడకు చేరుకుంది. పార్టీ నాయకులు మాజీ ఎంపీ బలభద్ర మాఝి దృష్టికి సమస్యను తీసుకు వెళ్లగా, కేంద్ర రైల్వేమంత్రి అశ్విని శ్రీవైష్టవ్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఇరుపార్టీల నాయకులు తిరిగి నవరంగ్‌పూర్ చేరుకున్నారు. స్థానిక నాయకులకు ఫోన్ చేసి తాము మాట్లాడామని, కౌంటర్ యథాతథంగా కొనసాగిస్తామని హామీ ఇచ్చారన్నారు.

విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మన్ మృతి

- జరజాపుపేటలో అలుముకున్న విషాదఛాయలు



విద్యుత్ స్తంభంపై వేలాడుతున్న శివ మృతదేహం

నెల్లిమర్ల రూరల్: కూలి పనులు చేసుకుంటూ ఒక్కగానొక్క కుమారుడిని చదివించి ప్రయోజకుడిని చేసిన ఆ తల్లిదండ్రుల ఆశలు ఎక్కువ రోజులు నిలవలేదు. ఎవరూ ఊహించని రీతిలో విద్యుదాఘాతానికి గురై చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోయి తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చాడు. ఈ ఘటనపై ఎస్సై నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట గ్రామానికి చెందిన మద్దిల నారాయణమూర్తి, లక్ష్మి దంపతుల కుమారుడు మద్దిల శివ(26) సచివాలయ జూనియర్ లైన్‌మన్‌గా స్థిరపడ్డాడు. బూరాడపేట గ్రామ సచివాలయం పరిధిలో మూడున్నరేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గ్రామానికి సమీపంలో ఉన్న ఓ పాల డైరీ నిర్వాహకుడు హైఓల్టేజీ వస్తోందని శివకు చెప్పడంతో శుక్రవారం పొలాల్లో ఉన్న విద్యుత్ లైన్ మరమ్మతులు చేపట్టేందుకు వెళ్లాడు. ఎల్‌సీ తీసుకుని విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా రిటర్న్ సప్‌లై కావడంతో విద్యుత్‌స్తంభంపైనే అపస్మారకస్థితికి చేరుకున్నాడు. కొన ఊపిరితో ఉన్న శివను స్థానికులు 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు శివకు అక్కతో పాటు తల్లిదండ్రులు ఉన్నారు. అసిస్టెంట్ జూనియర్ లైన్‌మన్ బంగారయ్య నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని మృతుని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నారాయణరావు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రాజాం సిటీ: మండల పరిధి గెడ్డవలస గ్రామానికి చెందిన బూరాడ సింహాచలం పురుగు మందు తాగి శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స అంజేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిఫర్ చేయనున్నామని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఇంత వరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.

మన విజయనగరం సైన్ బోర్డుకు షార్ట్ సర్క్యూట్



మన విజయనగరం సెల్ఫీ బోర్డు వద్ద వస్తున్న మంటలు

విజయనగరం క్రైమ్: స్థానిక ఎత్తుబ్రిడ్జి మీద నున్న మన విజయనగరం సెల్ఫీ సైన్ బోర్డు వద్ద శుక్రవారం కురిసిన భారీ వర్షానికి విద్యుత్ వైర్లు గాలికి చెదిరి షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో బోర్డు పక్కన ఉన్న వాటర్ ఫ్లో అయ్యే ఆకృతి అగ్నికి ఆహుతైంది. వెంటనే అప్రమత్తమైన అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు స్వీయ పర్యవేక్షణలో ఎస్సైలు లోవరాజు, ఏఎం రాజు ట్రాఫిక్ మళ్లించారు. మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ ఎస్.అప్పారావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సుమారు రూ. 2లక్షల వరకూ ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు.

సచివాలయ డీఏ ఆత్మహత్య



సచివాలయ డీఏ మాలి రవి మృతదేహం

భామిని: మండలంలోని సింగిడికి చెందిన డిజిటల్ అసిస్టెంగ్ మాలి రవి(35)పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిగురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి పురుగు మందు తాగి అస్వస్థతకు గురైన మాలి రవి(35)ని పాలకొండ ఆస్పత్రి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం మృతుని స్వగ్రామం సింగిడిలో శుక్రవారం అంత్యక్రియలు జరిగాయి. బంధువులతో పాటు 16 సచివాలయాల ఉద్యోగులు విషణ్ణ వదనాలతో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మండలంలోని నల్లరాయిగూడ గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా రవి పనిచేస్తున్నాడు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ప్రొహిబిషన్ డిక్లరేషన్ సందర్భంగా సహచరులతో ఆనందం పంచుకున్నాడు. ప్రభుత్వం పెంచిన జీతాన్ని ఆందుకోకుండానే అసువులు బాశాడని కుటుంబసభ్యులు విలపిస్తున్నారు. కుటుంబకలహాలతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై యతిరాజుల అమ్మనరావు తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు, తల్లిదండ్రులున్నారు.

వైభవంగా వేణుగోపాలుడి చక్రస్నానం



స్వామికి చక్రస్నాపం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో వేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవాలు శుక్రవారంతో వైభవంగా ముగిశాయి. సీతారామస్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో పూర్ణాహుతి జరిపించారు. అనంతరం స్వామికి సముద్ర నదీజలాలతో చక్రస్నానం చేపట్టారు. అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, వరప్రసాద్ పాల్గొన్నారు.



పచ్చిరొట్టతో సత్తువ రెట్టింపు

- జిల్లాకు 3,370 కింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాల కేటాయింపు
- ఎస్సీ, ఎస్టీ రైతులకు 90, ఇతరులకు 50 శాతం రాయితీపై విక్రయం
- రైతుభరోసా కేంద్రాల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు



రుద్రిపేటలో పచ్చిరొట్ట సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఎన్ని వాహిని, వ్యవసాయాధికారిణి

పాలకొండ రూరల్: భూమి సారవంతం (సత్తువతో)గా ఉంటే పంట ఏపుగా పెరుగుతుంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వస్తాయి. రైతుకు సాగు కలిసి వస్తుంది. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు భూమిని ముందస్తుగా సారవంతం చేసేందుకు వీలుగా ప్రభుత్వం ఖరీఫ్ సాగు ప్రణాళికను రూపొందించింది. పచ్చిరొట్ట విత్తనాలను రైతుభరోసా కేంద్రాల ద్వారా రాయితీపై పంపిణీ చేస్తోంది. సేంద్రియ సాగును ప్రోత్సహిస్తోంది. వ్యవసాయ అధికారులతో పచ్చిరొట్ట సాగుపై ఊరూరా అవగాహన కల్పిస్తోంది. జిల్లాకు 3,370 కింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేసి కావాల్సిన రైతులకు పంపిణీ చేస్తోంది.

పచ్చిరొట్టతో బహుళ ప్రయోజనాలు

ప్రధాన పంటకు 45 రోజులు ముందుగాపచ్చిరొట్ట విత్తనాలు (జనుము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ, నీలి, ఈడవినీలి వంటివి) పొలంలో విత్తుకోవాలి. 45 రోజుల్లో చేను పూతదశకు వస్తుంది. ఆ సమయంలో దుక్కి/దమ్ము చేయడం ద్వారా పచ్చిరొట్ట భూమిలో కలిసి సారవంతంగా మారుతుంది. భూమి అంతర పొరల్లో గుల్ల ఏర్పడి వానపాముల ప్రత్యుత్పత్తి జరుగుతుంది. ఈ వానపాములు పంటకు మేలు చేకూరుస్తాయి. భూమిలోని స్థూల పోషకాలైన నత్రజని 1.8 నుంచి 3.5 శాతం సమకూరుతుంది. భాస్వరం 0.1 నుంచి 0.3 శాతానికి, పొటాషియం 0.5 నుంచి 2.0 శాతానికి పెరుగుతుంది. పంట ఎదుగుదల, దిగుబడిలో ఈ పోషకాలు కీలంగా సహకరిస్తాయి. రసాయన ఎరువుల వినియోగాన్ని 30 శాతం మేర తగ్గించుకోవచ్చు. పచ్చిరొట్టతో పంట సేద్యానికి అవసరమైన కాల్షియం, నత్రజని, మాంగనీస్, గంధకం, జింకు వంటి సూక్ష్మధాతు వులు పుష్కలంగా సమకూరుతాయి. నీటినిల్వలు భూ అంతర్ పొరలకు చేరి పంట ఎదుగుదలకు సహకరిస్తాయి. భూమి ఆరోగ్యవంతగా మారుతుంది.

నాణ్యమైన దిగుబడులు

రైతులు ఏటా వరి వెదలు చల్లడంతో భూసారం తగ్గుతోంది. ప్రతీ రెండేళ్లకు ఓసారి పచ్చిరొట్టను సాగుచేయడం వల్ల భూమి సారవంతంగా మారుతుంది. రసాయనిక ఎరువుల అవసరం లేకుండానే పంట ఏపుగా పెరుగుతుంది. దిగుబడులు పెరుగుతాయి. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేలను సందర్శించాలి. పచ్చిరొట్ట సాగుకు ఇదే అదును.

ఆర్‌బీకేల ద్వారా....

రైతు భరోసా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. రైతులు తమ ఆధార్ కార్డుతో ఆర్‌బీకేలకు చేరుకుని బయోమెట్రిక్ వేసి కావాల్సిన విత్తనాలను ముందుగా నమోదు చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, ఇతరులు 50 శాతం రాయితీపై 10 కేజీల బ్యాగ్‌ల రూపంలో విత్తనాలను విక్రయిస్తోంది.

పచ్చిరొట్ట రకం, కిలో ధర, నిల్వలు, రాయితీ ఇలా..

రకం	అందుబాటులో ఉన్న విత్తనాలు (క్వింటాళ్లలో)	వాస్తవ ధర (కిలో)	50 శాతం రాయితీ	90 శాతం రాయితీ
జీలుగు	1,875	రూ.79	రూ.39.05	రూ.7.9
జనుము	1,375	రూ.84	రూ.42	రూ.8.4
పిల్లిపెసర	120	రూ.97	రూ.60	రూ.9.7

క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రికి జరిమానా

విజయనగరం లీగల్: ఒక రోగానికి బదులు మరో రోగానికి చికిత్స చేసి ఓ మహిళ మృతికి కారణమయ్యారన్న ఆరోపణ రుజువు కావడంతో విజయనగరం క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రికి జిల్లా వినియోగదారుల ఫోరం షాకిచ్చింది. చికిత్స కోసం వసూలు చేసిన మొత్తం 1.06.లక్షలతో పాటు మరో రూ.పది లక్షలు నష్టపరిహారం చెల్లించాలని కమిషన్ అధ్యక్షుడు ఆర్.వి.నాగసుందర్, సభ్యులు అశోక్ శర్మ, బంటుపల్లి శ్రీదేవి సంచలనాత్మక తీర్పు వెలువరించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలిలోని జెండా వీధికి చెందిన మలిశెట్టి సరోజిని అనారోగ్యానికి గురైంది. ఆమె 2020 డిసెంబర్ 26 న బొబ్బిలి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. ఆమెను పరిశీలించిన వైద్యులు క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రికి రిఫర్ చేశారు. వెంటనే ఆమె కుమార్తె సునీత సహాయంతో ఇక్కడ చేరింది. ఆమెకు కోవిడ్ రోగానికి చికిత్స చేశాక పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ సరోజినికి పరీక్షలు నిర్వహించి కోవిడ్ కాదని, కిడ్నీలు పూర్తిగా పాడై పోయాయని ,సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో వెంటనే చేరమని కేజీహెచ్ వైద్యులు సూచించారు. దీంతో కుటుంబసభ్యులు అక్కడికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. రోగాన్ని సరిగా గుర్తించలేక పోవడం, తగిన చికిత్స అందించని కారణంగానే ఘటన జరిగినట్లు గుర్తించారు.

● జలకళ



వారం రోజుల కిందట వేగావతి నది



శుక్రవారం నదిలో పరిస్థితి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న మోస్తరు, భారీ వర్షాలకు నదులు జలకళను సంతరించుకున్నాయి. మొన్నటివరకు ఇసుక తిన్నెలతో దర్శనమిచ్చిన నదుల్లో ఇప్పుడు నీరు ప్రవహిస్తోంది. దీనికి వేగావతి నదిలో నీటి ప్రవాహమే నిలువెత్తు నిదర్శనం. వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు, స్నానపానాదులకు నీటి ఇబ్బందులు ఉండవని నదీతీర ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – బొబ్బిలి

● మల్లెల అర్చన



వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని జామిలోని పురాతన త్రిపురాంతకస్వామి ఆలయంలో స్వామివారికి లక్ష మల్లెపూలతో అర్చకులు శుక్రవారం అర్చన జరిపారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. కనకదుర్గా మాత ఆలయంలోనూ అమ్మవారికి మల్లెలతో పూజలు చేశారు. – జామి

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన కాశీబుగ్గ డీఎస్పీ


ఎస్పీ రాధికను మర్యాదపూర్వకంగా కలిసిన కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వర రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా కాశీబుగ్గ సబ్ డివిజన్ డీఎస్పీగా నియమితులైన జి.నాగేశ్వరరెడ్డి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జీఆర్ రాధికను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈయన కృష్ణా జిల్లా నందిగామ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ సబ్‌డివిజన్ పరిధిలోని శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసింగ్‌పై ఎస్పీతో చర్చించారు.

వర్సిటీ అనుబంధ కళాశాలలకు 9 నుంచి సెలవులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలకు ఈ నెల 9 నుంచి 31 వరకు వేసవి సెలవులు ఇస్తున్నట్లు రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. వర్సిటీలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. జూన్ 1 నుంచి కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయని చెప్పారు. విద్యార్థులకు, అధ్యాపకులకు సెలవులు వర్తిస్తాయని తెలిపారు. వర్సిటీ నిర్వహించే పరీక్షలు, జవాబు పత్రాలు మూల్యాంకనం వంటివి యథావిధిగా కొనసాగు తాయని అన్నారు.

8 నుంచి మూడో దశ ఉద్యమాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 8 నుంచి ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో మూడో దశ ఉద్యమం జరగనుందని ఏపీ రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు అన్నారు. శుక్రవారం రెవెన్యూ వసతి గృహంలో మూడో దశ ఉద్యమాల కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నాయకత్వం జిల్లాలో పర్యటించనున్నందున అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. 9న నిర్వహించే 'సిక్కోలు గడ్డపై సింహనాదం' పెద్ద ఎత్తున జరిపేందుకు నిర్ణయించారు.

'పోస్టల్ సంఘాల గుర్తింపు రద్దు తగదు'

శ్రీకాకుళం అర్బన్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దేశ రాజధాని సరిహద్దుల్లో జరిగిన రైతుల ఉద్యమానికి ఆర్థిక సహాయం అందించారనే కారణంతో.. రెండు జాతీయ స్థాయి పోస్టల్ ఉద్యోగుల సంఘాల (ఎన్ఎఫ్‌పీఈ, ఏఐపీఈయూ గ్రూప్ సి) గుర్తింపును రద్దు చేసినట్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం దారుణమని పలు సంఘాల ప్రతినిధులు ధ్వజమెత్తారు. పోస్టల్ ఉద్యోగ సంఘాల గుర్తింపు రద్దు ఉత్తర్వులను విడుదల చేసిన నేపథ్యంలో శ్రీకాకుళంలోని పోస్టల్ ఉద్యోగుల సంఘ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ -సి ఉపాధ్యక్షులు యువీ రమణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తూ జాతీయ స్థాయిలో అన్ని ఉద్యోగ, కార్మిక సంఘాలు ఇప్పటికే పోస్టల్ ఉద్యోగులకు అండగా నిలిచాయని పేర్కొన్నారు. జిల్లా సీఐటీయూ కార్యదర్శి తేజేశ్వరరావు మాట్లాడుతూ పాలక ప్రభుత్వం చేతిలో అనధికారికంగా నడుస్తున్న ఒక గుర్తింపు లేని సంఘం ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు మేరకు స్వాతంత్ర్య సంగ్రామంలో సైతం కీలక పాత్ర పోషించిన చరిత్ర కలిగిన పోస్టల్ సంఘంపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ రెండు పోస్టల్ సంఘాల గుర్తింపును తిరిగి పునరుద్ధరించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించారు.

'దళితులపై వివక్ష తగదు'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వాణిజ్య పన్నుల శాఖలో అక్రమాలు బయట పడుతున్నాయనే భయంతో దళిత కులానికి చెందిన రాజేశ్వరిపై కక్ష కట్టి సస్పెండ్ చేయడం సరికాదని జిల్లా దళిత సంఘాల జేఏసీ నాయకులు కె.రాంగోపాల్, కంఠ వేణు, ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘ నాయకులు కిలారి నారాయణలు అన్నారు. అగ్రకులానికి చెందిన ఉన్నతాధికారులు రాజేశ్వరిని కావాలనే సస్పెండ్ చేసి మానసిక క్షోభకు గురిచేశారని ఆరోపించారు. సస్పెన్షన్ కాలం పూర్తవడంతో ఆమె శుక్రవారం వాణిజ్య పన్నుల కార్యాలయంలో తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా దళిత సంఘ నాయకులు ఆమెకు సంఘీభావం తెలిపారు.

14న మోడల్ లా సెట్ పరీక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: లా మోడల్ సెట్ పరీక్ష ఈ నెల 14వ తేదీన బీసీ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, ఎంపీఆర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ కె.మోసేలు తెలిపారు. వారు శుక్రవారం ఉదయం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 14న ఉదయం 10.30 గంటలకు మోడల్ లా సెట్ 3, 5 సంవత్సరంలో కోర్సులకు దరఖాస్తు చేసుకున్న వారు మోడల్ పరీక్షలో పాల్గొనవచ్చని తెలిపారు. నగరంలోని కొన్నావీధి ఎంపీఆర్ లా కాలేజీలో పరీక్ష ఉంటుందని, వివరాలకు 9640780728, 9440436496 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జీడి.. సిక్కోలు జీవనాడి!


పలాసలో కాష్యూ ఎక్స్‌పోకు సిద్ధమవుతున్న వేదిక

- పలాస వేదికగా నేషనల్ కాష్యూ టెక్నో ఎక్స్‌పో-2023
- నేడు, రేపు నిర్వహణ
- నూతన జీడిపప్పు ప్రాసెసింగ్ విధానంపై అవగాహన



కాశీబుగ్గ: సిక్కోలు జీవనాడిని దేశానికి చూపించే సమయం వచ్చింది. పలాస వేదికగా కాష్యూ టెక్నో ఎక్స్‌పో 2023 శనివారం నుంచి ప్రారంభం కానుంది. జీడి ప్రాసెసింగ్ యూనిట్‌పై అవగాహన కల్పించేందుకు ఈ మహత్తర కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పెనంపై కాల్చిన కాలం నుంచి బాయిలింగ్ యుగం వరకు జరిగిన మార్పులు, వాడుతున్న యంత్రాలపై ఔత్సాహికులు, వ్యాపారులకు అవగాహన కల్పించనున్నారు. పలాస జీడి పరిశ్రమ మరింత అభివృద్ధి చెందాలని పలాస కాష్యూ మాన్యుఫ్యాక్చర్ అసోసియేషన్ వారు ఎక్స్‌పోను సమర్థంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

డిగ్రీ కాలేజీ మైదానంలో..

ది పలాస కాష్యూ మాన్యుఫ్యాక్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శని, ఆదివారాల్లో జాతీయ ఏడో కాష్యూ టెక్నో ఎక్స్‌పో 2023 నిర్వహిస్తున్నట్లు పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్, కార్యదర్శి కేవీ శివకృష్ణ, ట్రెజరర్ పి.రవికాంత్‌లు తెలిపారు. పలాసతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు ఈ ఎక్స్‌పోలో పాల్గొని అవగాహన పెంచుకుని జీడి వ్యాపారంలోకి అడుగు పెట్టాలన్నది వారి ఉద్దేశం. పలాస జీడిపప్పుకు ఉన్న గుర్తింపు నేపథ్యంలో మార్కెట్‌ను మరింత విస్తరించేందుకు, పరిశ్రమలు పెంచేందుకు, మరిన్ని కొత్త యంత్రాలను వినియోగించేందుకు ఎక్స్‌పోను వేదికగా వినియోగించుకోనున్నారు. నిరుద్యోగులు, ఔత్సాహికులు, వ్యాపారులు అందరూ ఈ కార్యక్రమానికి హాజరై ప్రత్యక్షంగా జీడి ప్రాసెసింగ్ నూతన పద్ధతులు తెలుసుకోవచ్చని వారు తెలిపారు.

ఏం ప్రదర్శిస్తారు..?

- పలాస అంటే జీడిపప్పుకు పెట్టింది పేరు. అందుకే రాష్ట్రంలోనే తొలిసారిగా పలాస వేదికగా ఎక్స్‌పోను నిర్వహించనున్నారు.
- ఎక్స్‌పోలో వివిధ దేశాల నుంచి వచ్చిన పలు కంపెనీల ప్రతినిధులు వివిధ రకాల యంత్రాలను ప్రదర్శనకు పెట్టి వాటి గురించి వివరిస్తారు. సందర్శకుల సందేహాలను కూడా నివృత్తి చేస్తారు.
- వియత్నా దేశం నుంచి సీఎంపీ కంపెనీ కటింగ్ మిషన్, పీలింగ్ మిషన్, ఇండియాలో ఉన్న వివిధ రకాల కంపెనీలకు చెందిన కటింగ్ మిషన్లు, షార్టెక్స్‌లు, ప్యాకింగ్ మిషన్‌లు, వివిధ రకాల అధునాతన మిషనరీలు ప్రదర్శిస్తారు.
- పలాసలో గతంలో పెనంతో జీడిపప్పు ప్రాసెసింగ్ ప్రారంభమై, రోస్టింగ్‌లో విస్తరించి ఆఖరికి బాయిలింగ్ వరకు చేరింది. రానున్న రోజుల్లో కొత్త టెక్నాలజీ మిషన్‌లను సైతం ఇక్కడ ప్రదర్శిస్తారు.
- ఈ ఎక్స్‌పోలో సిఎంవి, ముచ్చిస్ ఎంటర్ ప్రైజెస్, క్యూబ్, మారుతీనందనన్, జేపి, నోవా, మోక్సివెల్, శ్రీవా, కోమటెర్, జోగ్‌తో పాటు మరో 20 కంపెనీలు పాల్గొననున్నాయి.

ఇక్కడ ఏడోది..


వివరాలు వెల్లడించి పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీసీఎంఏ కార్యవర్గం

భారతదేశంలో కాష్యూ టెక్నో ఎక్స్‌పో తొలిసారి కర్ణాటకలో ప్రారంభించి అక్కడి మూడు సార్లు నిర్వహించారు. అనంతరం కేరళ రాష్ట్రంలో ఒక్క సారి, మహారాష్ట్రలో ఒకసారి, గుజరాత్‌లో ఒకసారి మాత్రమే నిర్వహించారు. తొలిసారిగా పలాసలో నిర్వహిస్తున్న ఈ ఎక్స్‌పో దేశంలోనే ఏడోది. రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

రామాలయ ప్రతిష్ఠాపన ప్రారంభం


కలశాలతో ఎదురేగి స్వాగతం పలుకుతున్న మహిళలు


సీతారామచంద్ర విగ్రహాలు

గార: అంపోలులోని శ్రీరామాలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ మహోత్సవాలను కళింకోటకు చెందిన రేజేటి శ్రీరామాచార్యులు పర్యవేక్షణలో సీతారామ చార్యులు, గ్రామ పురోహితులు ఆరవెల్లి గురునాథంబాబు, జగదీష్, శ్యామసుందర శర్మ, ప్రదీప్‌శర్మల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, గ్రామస్తుల సహకారంతో నిర్మించిన ఈ రామాలయ ప్రతిష్ఠలో భాగంగా విగ్రహాల ఊరేగింపు జరిగింది. మహిళలు కలశాలతో ఎదురుగా వెళ్లి స్వాగతం పలికారు. స్థానిక చిన్నారుల కోలాటం, మంగళవాయిద్యాలు, మంత్రోచ్ఛరణల మధ్య ఊరేగింపు జరిగింది. సాయంత్రం విశ్వక్షేణ పూజ, రక్షాసూత్రధారణ, దీక్షాధారణ, అంకురార్పణ వంటి వైదిక కార్యక్రమాలు జరిగాయి.

ముగిసిన కల్యాణ క్రతువు


అవబృథ స్నానాలు చేయిస్తున్న దృశ్యం


ఉత్సవమూర్తులకు పుష్పాలను సమర్పిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవాల్లో శుక్రవారం స్వామికి అవబృథ స్నానం, పుష్పయాగ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో భూనీలా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సమూర్తులకు అవబృథ స్నానాలు చేయించారు. దీంతో కల్యాణోత్సవాలు ముగిశాయి. ముందుగా ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా పూలతో అలంకరించిన కల్యాణ మండపంపై ఉంచి పూజలు నిర్వహించారు. ముందుగా బంతి, చామంతి, మల్లె, జాజి, విరజాజి, వాడంబరం, గులాబి, లిల్లీ, వంటి పలు రకాల పూలను భక్తులు తలపై ఉంచుకొని ఆలయ బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేసి కల్యాణ వేదిక వద్దకు చేర్చారు. అనంతరం స్వామిని పుష్పాలతో పూజలు చేశారు. కార్యక్రమంలో వేంకటరామానుజ సేవాదళం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కిరాణా సామగ్రి దగ్ధం


కిరాణా దుకాణంలో దగ్ధమైన వస్తువులు

సారవకోట: మండల కేంద్రంలోని బజారు వీధిలోని దుంప రవికుమార్‌కు చెందిన కిరాణా దుకాణంలో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. దుకాణానికి ఎదురుగా ఉన్న ఇంటిలో కిరాణా వస్తువులతో పాటు పాన్‌షాపు సామగ్రి భద్రపర్చుకుంటున్నారు. అర్ధరాత్రి సమయంలో కిరాణా సరుకులు ఉన్న ఇంటిలో అగ్ని ప్రమాదం సంభవించి సుమారు రూ.3 లక్షల విలువ గల కిరాణా వస్తువులు, సామగ్రి కాలిబూడిదైపోయాయి. ఇంటికి సమీపంలో ఉన్న వారు ప్రమాదాన్ని గుర్తించి యజమానికి సమాచారం అందించారు. గ్రామస్తుల సహకారంతో మంటలను అదుపు చేశారు. అప్పటికే అందులోని వస్తువులు దగ్ధమయ్యాయి. దీనిపై పోలీసులకు సమాచారం అందించడంతో తెల్లవారుజామున పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కొందరు ఉద్దేశపూర్వకంగానే నిప్పు పెట్టి ఉంటారని బాధితుడు ఆరోపిస్తున్నారు.

ఆదిత్యునికి బంగారు ఛత్రం


రూ.16 లక్షలు విలువైన ఛత్రం ఇదే

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామికి మరో విలువైన బంగారు ఆభరణం అలంకరణకు సిద్ధమైంది. రూ.16లక్షలు విలువైన 249 గ్రాముల బంగారంతో తయారుచేసిన బంగారు ఛత్రంను స్థానికులైన 'బోయిన రమణయ్య' కుటుంబ సభ్యులు సంయుక్తంగా స్వామికి సమర్పించారు. శుక్రవారం ఉదయం ఈ మేరకు దాతలు ఇచ్చిన బంగారు ఛత్రంకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి అలంకరణకు సిద్ధం చేశారు.

బోయిన రమణయ్య, పద్మా వతి దంపతులు, వడ్డి దివిజ, పొట్నూరు శంకరరావు, వనజాక్షి దంపతులు, పొట్నూరు ధర్మరాజు, జయలక్ష్మి దంపతులు, మోనంగి శ్రీవల్లి, గుడ్ల గౌరీశంకర్, మోనంగి ఝాన్సీరాణి, మోనంగి రవీంద్ర, కొత్తకోట లలిత్ లోచన్, ఇంకుల మాన్విష్, మోనంగి కాలబాలాజీ తదితరులు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్‌కు ఆభరణాన్ని అందజేశారు.

జెడ్పీలో ముగ్గురికి పదోన్నతి


దేవికి నియామక పత్రాన్ని అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

అరసవల్లి: జిల్లా పరిషత్ యాజమాన్యంలో పలు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో రికార్డు అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ముగ్గురికి జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించాయి. ఆమదాలవలస మండలం దూసిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎల్.షణ్ముఖరావుకు కోటబొమ్మాళి మండల ప్రజాపరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించారు. అలాగే ఎచ్చెర్ల మండలం కుప్పిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.కృష్ణకిషోర్‌ను వంగర మండలం కొప్పర జెడ్పీ ఉన్నత పాఠశాల జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించారు. అదేవిధంగా గార మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.దేవికి సోంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు వీరికి పదోన్నతితో కూడిన నియామక పత్రాలను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ శుక్రవారం ఉదయం అందజేశారు. మరింత బాధ్యతగా పని చేయాలని వారికి సూచించారు.

నేటి నుంచి క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో సమ్మర్ క్రికెట్ ఉచిత కోచింగ్ క్యాంప్ శనివారం నుంచి మొదలుకానుంది. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జరిగే ఈ శిక్షణ శిబిరాలు 6వ తేదీన ఉదయం 9.30 గంటలకు మొదలుకానున్నాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరానికి బాలబాలికలు, యువ, వర్ధమాన క్రీడాకారులంతా హాజరై సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ముస్తాక్ మహ్మద్ కోరారు. జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్-సెంటర్ల నుంచి క్రీడాకారులు హాజరుకావాల్సి ఉంటుందని ఆయన కోరారు.

అన్ని సబ్-సెంటర్లలోను శిక్షణ..

7వ తేదీ నుంచి అన్ని సబ్ సెంటర్లలోను శిక్షణ శిబిరాల నిర్వహణకు జిల్లా క్రికెట్ సంఘం చర్యలు తీసుకుంది. శనివారం శ్రీకాకుళంలో జరిగే ఈ ఉచిత సమ్మర్ క్రికెట్ కోచింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి, సీఈఓ శవరెడ్డి తదితరులు హాజరుకానున్నారు. జిల్లాలో క్రికెట్ కార్యకలాపాల తీరు, అభివృద్ధి, సాధించాల్సిన ప్రగతి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు. ఏసీఏ పెద్దలు దిశానిర్దేశం చేయనున్నారు.

చెత్తశుద్ధి కోసం చిత్తశుద్ధితో..


ఎస్పీ రాధిక చేతుల మీదుగా నగదు అందుకుంటున్న సైక్లిస్టు ప్రభు

శ్రీకాకుళం క్రైమ్ : చెత్త లేని దేశం కోసం ప్రజల్లో చైతన్యం నింపేందుకు అతను 15వేల కిలోమీటర్ల భారత యాత్రకు శ్రీకారం చుట్టాడు. గోవా నుంచి పయనం మొదలుపెట్టి శ్రీకాకుళం వరకు వచ్చాడు. దారి మధ్యలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ బాలలపై వేధింపులు చేయకూడదని చైతన్యం కల్పిస్తూ ఊరూరూ దాటుతున్నాడు. సైకిల్‌పై దేశాన్ని చుట్టేస్తున్న ప్రభు శుక్రవారం ఎస్పీ జీఆర్ రాధికను మర్యాదపూర్వకంగా కలిశాడు. ప్రభు ఉద్దేశాన్ని తెలుసుకున్న ఎస్పీ రాధిక విరాళాలు ఇవ్వాలని పిలు పునివ్వడంతో డాక్టర్ దానేటి శ్రీధర్, రెడ్డి చిరంజీవి, సూర శ్రీను, బోస్ ఈజ్ బ్యాక్, నేను సైతం తదితర ఎన్జీవోలంతా స్పందించి తక్షణమే పోలీసు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఎస్పీ ఇచ్చిన కొంత నగదు, ఎన్జీవోలు సమకూర్చిన నగదు కలిపి రూ. 50 వేలును ప్రభుకు అందజేశారు. దారిలో ఏ సాయం కావాలన్నా తనను అడగాలని ఎస్పీ సైక్లిస్టుకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వర్రావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో 65 గొర్రెలు మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలు

ఆమదాలవలస: ఆమదాలవలస మండల పరిధిలోని తమ్మినాయుడు పేట-గోపీనగర్ మధ్యలో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 65 గొర్రెలు మృతి చెందాయి. మరో 50 గొర్రెలతో పాటు ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఆమదాలవలస ఎస్ఐ వై.కృష్ణ తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. రణస్థలం మండలం మహంతి పాలేం గ్రామానికి చెందిన జి.సూరప్పడుకు సుమారు 500 గొర్రెలు ఉన్నాయి. ఈ గొర్రెల మందను గంగులు అనే వ్యక్తి సహాయంతో రెండునెలల కిందట సరుబుజ్జిలి, ఆమదాలవలస, బూర్జ తదితర ప్రాంతాల్లో మేత కోసం, మందలు వేసేందుకు తిప్పుతున్నారు. తిరిగి మహంతిపాలెంకు మందను తీసుకువెళ్తుండగా.. జాతీయ రహదారిపై రావులపాలేం నుంచి ఒడిశా బుల్లుగాంకు అరటిపండ్ల లోడుతో నరసన్నపేట వైపు వెళ్తున్న లారీ గొర్రెల మందపైకి దూసుకుపోయింది. దీంతో 65 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయని, మరో 50 గొర్రెలకు గాయాలయ్యాయని ఎస్ఐ తెలిపారు. గొర్రెలు తోలుకొని వెళ్తున్న యజమాని సూరప్పడుతోపాటు గంగులుకు తీవ్ర గాయాలు కాగా.. వారిని 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. లారీని అతివేగంతో నడిపిస్తూ గొర్రెలు అడ్డంగా వచ్చేసరికి అదుపు చేయలేకపోవడంతో ఈ ప్రమాదం సంభవించిందని ఎస్ఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీని అదుపులోకి తీసుకున్నామని, లారీ డ్రైవర్‌ను అరెస్ట్ చేశామని చెప్పారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సింహాచలం

కోటబొమ్మాళి: హరిశ్చంద్రపురం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో హరిశ్చంద్రపురం పంచాయతీ వింజాంపాడు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ కొమాలాపల్లి సింహాచలం (38) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింహాచలం కుంబాలపేటలో రోగుల వద్దకు వెళ్లేందుకు ఉదయం 6 గంటలకు గ్రామం నుంచి బయల్దేరారు. హరిశ్చంద్రపురం ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి.. పాడైపోయి ఆగి ఉన్న ఇటుకల ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్నాడు. సింహాచలం తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సింహాచలంకు భార్య రేవతి, కుమారుడు,కుమార్తె ఉన్నారు. కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


మృతి చెందిన రామారావు

సంతబొమ్మాళి: నౌపడ పంచాయతీ సీతానగరం గ్రామానికి చెందిన బత్సల రామారావు (39) మోటార్ రిపేర్ చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి శుక్రవారం మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రామారావు విదేశాల్లో పనిచేసేవాడు. ఏడాదిన్నర కిందట గ్రామానికి వచ్చేశాడు. శుక్రవారం ఉదయం ఎప్పటిలాగానే ఉప్పు లోడింగ్‌కు వెళ్లి ఇంటికి వచ్చాడు. ఉదయం 8 గంటల ప్రాంతంలో తన ఇంటి వద్ద మోటార్ పంపు రిపేర్ చేస్తుండడంతో షాక్ కొట్టింది. అయితే ఆ సమయంలో అతని దగ్గర ఎవరూ లేకపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాసేపటికి భార్య ఉమామహేశ్వరి వచ్చి చూసేసరికి భర్త విగత జీవుడై పడి ఉన్నాడు. దీంతో ఆమె చుట్టుపక్కల వారికి విషయం చెప్పి భర్తను టెక్కలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కానీ రామారావు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి ఆరో తరగతి చదువుతున్న కుమార్తె దీపిక, ఒకటో తరగతి చదువుతున్న మరో కూతురు విద్య ఉన్నారు. మృతునికి తల్లిదండ్రులు, సోదరులు ఎవరూ లేకపోవడంతో కుటుంబం అనాథగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతుని భార్య ఉమామహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదుతో నౌపడ పోలీసులు టెక్కలి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో గ్రానైట్ కార్మికుడు..

నందిగాం: మండలంలోని దేవుపురం పంచాయతీ కొండతెంబూరు సమీపంలో ఉన్న సన్‌రాక్ గ్రానైట్ పాలిష్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న కృష్ణలాల్ (47) శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన కృష్ణలాల్ గత కొన్నేళ్లుగా సన్‌రాక్ గ్రానైట్ పాలిష్ ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఎప్పటిలానే గురువారం రాత్రి తన పని ముగించుకొని పక్కనే ఉన్న షెల్టర్‌లోకి వెళ్లిపోయాడు. శుక్రవారం సాయంత్రం యూనిట్‌లో ఒక మిషన్ పనిచేయడం లేదని, అక్కడ విధులు నిర్వహిస్తున్న వ్యక్తి ఫోన్ చేయగా కృష్ణలాల్ కాలికి చెప్పులు లేకుండా వెళ్లి పని చేస్తుండగా షాక్ కొట్టింది. అయితే అక్కడి వారంతా ఫ్యాక్టరీ యజమాని వాహనంలో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే చనిపోయాడు. నందిగాం ఎస్ఐ మహమ్మద్ అమీర్‌ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణలాల్ మృతదేహాన్ని ఓ ప్రైవేటు అంబులెన్స్‌లో రాజస్థాన్ రాష్ట్రానికి తరలించారు. మృతునికి భార్యాపిల్లలు ఉన్నారు.

పరీక్షల్లో ఫెయిల్ అవుతానేమోనని..


ఆత్మహత్యకు పాల్పడిన మేఘన

శ్రీకాకుళం క్రైమ్ : 'నేను ఎగ్జామ్స్‌కు సరిగా చదవలేకపోయాను. పరీక్షల్లో తప్పుతానేమోనని భయంగా ఉంది.. నాన్నా సారీ..' అంటూ సూసైడ్ నోట్ రాస్తూ ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శ్రీకాకుళంలో శుక్రవారం కలకలం రేపింది. ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం గార మండలం కొల్లివలస గ్రామానికి చెందిన అప్పిలి రాంబాబుకు మేఘన, హేమలత అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాంబాబు వ్యవసాయంలో కలిసి రాక తన కుటుంబంతో కలిసి విశాఖపట్నంలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 2021 జూన్‌లో పెద్ద కుమార్తె మేఘనను ఎచ్చెర్ల మండలం బొంతల కోడూరు గ్రామానికి చెందిన యెన్ని కాంతారావుకు ఇచ్చి వివాహం చేశారు. అప్పటికే పాలిటెక్నిక్ చదువుతున్న మేఘన చదువు కొనసాగించడానికి భర్త ఒప్పుకోవడంతో తండ్రి ఇంటి వద్దనే ఉంటూ కళాశాలకు వెళ్లేది. పాలిటెక్నిక్ మూడో సంవత్సరం పూర్తయి పరీక్షలు అడ్వాన్స్‌డ్ రాసింది. అయితే పరీక్ష బాగా రాయలేదని బాధ పడుతూ ఉండడంతో ఆమెను తండ్రి రాంబాబు శ్రీకాకుళం అరసవిల్లి బొంపాడవీధిలో నివాసముంటున్న తన మరదలు దుబ్బాక రోహిణి ఇంటికి వారం రోజుల ముందు పంపించారు. అయితే మేఘన ఇంటిలో ఎవరూ లేని సమయం చూసి సూసైడ్ నోట్ రాసి శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బయట నుంచి వచ్చిన మేఘన పిన్ని జరిగిన ఉరి వేలాడుతున్న మేఘన మృతదేహాన్ని చూసి నిశ్చేష్టురాలైంది. వెంటనే మేఘన తండ్రి రాంబాబుకు ఫోన్ చేయడంతో భార్యతో కలిసి వచ్చి భోరున విలపించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

పరారైన వ్యక్తి అరెస్ట్

పాతపట్నం: ఏప్రిల్ 30వ తేదీన పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని స్నేహ షాపింగ్ మాల్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ఒకరి మృతికి కారణమైన వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఈ ప్రమాదంలో మెకానిక్ బోరాడ వేణుగోపాల్ మృతి చెందాడు. బైక్‌ను ఢీకొట్టిన కారుడ్రైవర్ ఎల్ ఎన్ పేటకు చెందిన దివాకర్‌ను అరెస్టు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరిచామని ఎస్ఐ కామేశ్వరరావు తెలిపారు. కారును కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు.

వెయ్యి సారాప్యాకెట్లతో వ్యక్తి అరెస్టు

కంచిలి: మండలంలోని జలంత్రకోట జంక్షన్ వద్ద జాతీయ రహదారి మీదుగా మోటారు సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు శుక్రవారం నాటుసారా ప్యాకెట్లను రవాణా చేస్తూ పోలీసులకు దొరికిపోయారు. సోంపేట సీఐ ఆర్.రవిప్రసాద్, కంచిలి ఎస్ఐ ఎస్.చిరంజీవిలు వెంబడించి ఒకరిని పట్టుకున్నారు. రాగుపురం గ్రామానికి చెందిన గేదెల ధర్మరాజు, మఠంసరియాపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ బుకారిలు మోటారు సైకిల్ మీద 1000 నాటుసారా ప్యాకెట్లను బ్యాగుల్లో రవాణా చేస్తుండగా, పలాస నుంచి వస్తున్న సీఐ, ఎస్ఐలు గమనించి వారిని వెంబడించారు. ఇద్దరిలో గేదెల ధర్మరాజు తప్పించుకోగా, సయ్యద్ బుకారి, మోటారు సైకిల్, సరుకుతో దొరికిపోయాడు. ఇద్దరిపై కేసు నమోదు చేసి, బుకారిని అరెస్టు చేశారు.